# మానవత్వం

రామరాజ్యం

"మావాఁ నువ్వేలా బాధ పడుతుండేది సూట్టా నేనె సెబ్ను"

"రత్తీ, ఏంటియ్యాల కొత్తగా మాటాడతుండావ్ ఎల్లు ఎల్లి తొరగా పనిచూసుకుని రాయే"

"మావాఁ, నా కెందుకో యియ్యాల నిన్నొదిలి ఎల్లబుద్ది కావటంలేదు"

"పిచ్చి మొగమా. యాంటే మాటలు. యిది పెద్ద బొంం కాదులేయే ఒల్లు కాస్త ఎచ్చగా వుందంటే నువ్వేల్లవే, లేపోతే పెద్దోరి సేత మాటొత్తాది"

ఆరోజు మబ్బులు ఆకాశం నిండా అల్లుకుపోయాయి ఎటుసూసినా దట్టంగా, నల్లగా. సరిహద్దుల్లో పొంచివున్న శత్రువుల్లా కనిపడుతున్నాయి ఆ మబ్బుల గుంపుల్లో అప్పుడే వుదయిస్తున్న సూర్యుడు బందీ అయిపోయాడు నెమ్మదిగా యీదురుగాలి ప్రారంభమైంది. అది చిన్న చిన్నగా పెద్దదై గాలిదుమ్ముగా మారిపోయింది, ఫెళ ఫెళ మంటూ వురుములు, మెరుపులు మొదలయ్యాయి.

భర్తమాట మీద నున్న గౌరవంకొద్దీ, వెళ్ళకపోతే చాకిరీ పోతుందన్న భయం కొద్దీ, కాళ్ళతో బలంకొద్దీ ఎదురుగాలికి అడుగులు వేస్తూ మంగపతిరావు యింటికి చేరింది రత్తాలు.

రత్తాలుకి పాపన్నకు పెళ్ళయి మూడేళ్ళయింది పెళ్ళైన ఏడాదిలోనే కూలీనాలీ చేసుకుని బ్రతికే పాపన్న మంగపతిరావు దగ్గర పాలేరుగా కుదిరాడు

మంగపతిరావు ఆ గ్రామంలో డబ్బున్న వాళ్ళల్లో బాగా డబ్బున్నవాడు తెలివైన వాడు ధైర్యవంతుడు పిసినారి మంగపతిరావుకి భార్య వుంది. అందకత్తె కాదు కాని, ఆదర్శ గృహిణి. ఒక్కడే కొడుకు. రాంబాబు పట్టణంలో కాలేజీలో చదువుతున్నాడు

"నీ పెళ్ళాం అక్కడా. యిక్కడా కూలీ నాలీ చేసుకోకపోతే యీ యింటిలో పని మనిషిగా వుండకూడ దేవిట్రా మీరిద్దరూ ఒకే చోట పడివుండొచ్చుగదా"

ఒకరోజు మంగపతిరావు పాపన్నతో అన్నాడు.

ఆ విషయం విన్న పాపన్న అక్షరం ముక్కరానివానికి మంత్రి పదవి వచ్చినంత సంబరపడి పోయాడు ఆ మరుసటి రోజే రత్తిని పనిలో పెట్టాడు.

రత్తికి అందం వుంది. ముక్కు నున్న కాడ, మెడను అంటి పెట్టుకున్న తలకొప్పు ఎడం భుజమ్మీద నుండి తిరిగివచ్చి బొడ్డులో దూర్చుకున్న పయిటచెంగు, కాళ్ళకు చుట్టూ నున్న కడియాలు - వీటిని మారిస్తే రత్తి

అప్సరస అవుతుంది.

వున్న అందానికి మెరుగులు పెట్టి రత్తిని అప్సరసలా చెయ్యాలని పాపం పాపన్నకు తెలియదు తెలిసిన మంగపతిరావు చూస్తూ పూరుకోలేదు. సమయం దొరికినప్పుడల్లా ఆ మాట అంటూనే వున్నాడు. రత్తాలు. పాపన్న ప్రక్క ప్రక్కన నడుస్తుండటం చూస్తే మంగపతి రావుకు అసూయ గలిగేది. ఆ వేశం వచ్చేది కళ్ళు ఎర్రబడేవి వెంటనే గదిలోకి వెళ్ళి భార్యమీద రెండు కేకలు వేసి మంచం మీద వాలిపోయి ఆలోచనలతో నిద్రపోయేవాడు

ఒకరాత్రి అనుకోకుండ పాపన్నకు జెంపరేచరు పెరిగింది. వళ్ళంతా వెచ్చబడింది. సూర్యోదయ మవ్వగానే ఆకాశం నిండా మబ్బులు. గాలి వురుములు మెరుపులు వెళ్ళలేనని చెబుతున్నా వినకుండా రత్తిని పనిలోకి పంపాడు పాపన్న

మంగపతిరావు ఇంటికి చేరుకున్న రత్తాలు గబ గబా తలుపు బాదింది ఏ నౌకరో, అమ్మగారో తియ్యవలసిన తలుపు ఆ రోజు మంగపతిరావు తియ్యడం చూసి. ఆశ్చర్యపోయి, తప్పించుకుని వంటగది చేరుకుంది రత్తాలు యింటిలోని పనంతా వెంటనే పూర్తిచేసి తన మామ దగ్గరకు పరుగెత్తాలని ఆరాటంతో. ప్రతీ పని త్వరత్వరగా చేసుకుపోతుంది. ఏం చేసినా. రత్తాలుకు యింటి దగ్గర జ్వరంతో మూలుగుతువన్న పాపన్నే కళ్ళెదుట కనబడుతున్నాడు.

ఛి...ఛీ.... తను మనసున్న మనిసికాదు యింటికాడ మొగుడు అంత జొరంతోవుంటే వదిలిపెట్టి రాడం బుద్దున్నవోళ్ళు చేసే పని కాదు అయినా మామే "పనీ .... పనీ" అంటూ పంపాడు ఈరోజు పనికి రాపోతే ఏటయ్యేది నాగా పడేది. అంతేగా. కాని యియ్యాల మామకు మందియ్యక పోతే బతుక్కే నాగా పడతాదేమో ఛ... ఛ....ఏటి

(మిగతా 57 వ పేజీలో)

## మానవత

**—డా॥ గంధం జోసెఫ్**

వేడల ప్రక్కన
నీడల్లో గుడిసెలు;
గుడిసెల్లో గ్రుక్కెడు
గంజినీళ్ళు దొరకని
మనుషులు అభాగ్యులు
నల్లగుడ్డల వాళ్ళని
ఖాతరు చెయ్యని
తెల్ల టోపీల వాళ్ళు
పిచ్చి వేషాలు వేసి.
మెప్పును పొందే
పురానా దొంగలు -
దొరల్లా కనిపించే
గడుసైన దొంగలు
మెల్లగా పాలు త్రాగే
మోసపు గండుపిల్లులు।
వీళ్ళంటారు.
మేము బ్రతకాలని
వాళ్ళంటారు.
మా పెత్తనం జండా
దివినిండా ఎగరాలని
గుడిసెల వాళ్ళు
మానవులు కారా?
మేడల్లో జీవించేవారు
మాత్రం నరులే కారా?
ఈ మేడలు - ఈ గుడిసెలు
చిరకాలం వుండవు
కలకాలం బ్రతికేది
కల్లల ఎల్లలు తుడిచేది
మనిషికి కావలసింది
దానవత కాదు
మానవత - సమానత

# మానవత్వం

(48 వ పేజీ తరువాయి)

నా పాడు ఆలోచను మాయందు మందుంటే నా మామ కేమి అవ్వదు. అయినా యిపుడు కొంప మునిగేదేటి అమ్మగారికే విసయమంతా సెప్పి ఇంటికి పోవచ్చు కాని. అమ్మగోరింకా లేవలేదు ఎట్టాగ? అయ్యగోరుకే సెబితె ఎట్టా గుంటాద అసలీ విసయం కూడా అయ్యగోరికీ సెప్పొద్దన్నాడు మామ. మామకసలు మతిలేదు సెబితే యేం తప్పు లేదు. అసలు సెప్పందే మన బాధలు ఎదుటోళ్ళ కెట్టాతెలుత్తాయి;'

ఒక నిర్ణయాని కొచ్చిన రత్తాలు పని సగంలో వదిలేసి మంగపతిరావు గది బయట నిలబడింది గది తలుపులు మూసిలేవు.

"అయ్యగోరూ"

ఆ మాటవిని గాలిలోకి సిగరెట్ పొగ వదులుతూ పైకి చూస్తున్న మంగపతిరావు కుర్చీలోంచి లేవలేదు ఏమిటన్నట్టు గుమ్మంవేపు చూశాడు

"మావకు జొరం లేవనేదు. నా నింటికి పోతా బాబు"

"ఆ! పాపిగాడికి జ్వరమా! మరైతే ఎందుకొచ్చావు వెళ్ళు"

యింటి ముఖం పటింది రత్తాలు

"రత్తాలుఅగు" పిలిచాడుమంగపతిరావు.

రత్తాలు ఆగి మంగపతిరావు వైపు చూసింది.

"ఇదిగో ఈ పదిరూపాయలు తీసుకెళ్ళు. మందుల కుపయోగపడతాయి" మంగపతిరావు కూర్చొనే జేబులోనుండి పది రూపాయల నోటు బయటకుతీసి చూపాడు. చూసిన రత్తాలు గదిలో అడుగుపెటడానికి అభ్యంతరంగా గుమ్మం దగ్గరే నిలబడి పోయింది

"ఫర్వాలేదు. లోపలకు వచ్చి యీ డబ్బు తీసుకెళ్ళు"

మరో వేపు చూస్తూ అన్నాడు మంగపతిరావు.

నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ లోపలకు వెళ్ళింది రత్తాలు

ఎదుట మనిషి విలువల్ని డబ్బుతో లెక్కగట్టి వాళ్ళని "రఫీ" మని ఎక్కడ పడెయ్యాలో మంగపతిరావుకు తెలియవనడం వెర్రితనం

పదిరూపాయల నోటు అందుకోబోతున్న రత్తి చేతిని గట్టిగా పట్టుకున్నాడు మంగపతిరావు.

గుండె గుభేలు మంది రత్తికి. వళ్ళు కంపర మెత్తింది.

'నువ్వు అచ్చంఅప్సరసలా వుంటావు రత్తి'

ఎప్పటినుంచో ఆ సమయం కోసం పొంచివున్న మంగపతిరావు ఆ సదవకాశాన్ని వృథా చెయ్య కూడదనుకున్నాడు.

పట్టు విడిపించుకుని బయటకు పారిపోవాలని గింజుకుంటున్న రత్తాలు బలమైన అతని హస్తాల్లో, మానవత్వంస్థానే వురికలు వేస్తున్న అతని పశుత్వానికి బలై పోయింది

బయట ఫెళ ఫెళ మంటూ మెరుపులతో కూడిన వురుముల మధ్య రత్తి కేకలు. ఏడుపులూ ఎవ్వరికీ వినిపించలేదు. తెరుచుకున్న తలుపుల్ని మూసి బయట గొళ్ళెం పెట్టి కాపలాగా కూర్చున్న గోపయ్య కుతప్ప.

ధర్మానికీ, అధర్మానికీ మధ్య జరిగిన పెనుగులాటలో ధర్మం ఓడి పోయింది

* * *

తెలవారడంతోనే ఊరంతా గుప్పుమంది

ఎవరినోట విన్నా ఒకటే మాట "రత్తాలు నూతిలో పడి చచ్చి పోయింది"

ఆత్మహత్య చేసుకుందన్నారు కొందరు అంత అందమైన పిల్ల నూతిలో పడితే ఆత్మహత్యగాక మరేమౌతుందన్నారు అదే కొందరు పాపం పాపన్నగాడి బ్రతుకు చితికి పోయిందన్నారు మరి కొందరు భర్తను అంటిపెట్టుకుని నీతిగా బ్రతికే

యిల్లాలు శాశ్వతంగా దూరమై పోతే యిక ఆ భర్త బ్రతుకు చితికిపోవడం గాక మరేమిటి అన్నారు అదే మరి కొందరు.

గోపయ్యను కూడబెట్టుకుని మంగపతి రావు పాపన్న యింటికి వచ్చాడు పుట్టెడు దుఃఖంతో మంచానికతుక్కుపోయిన పాపన్నను ఓదార్చాడు ఆ దుఃఖంలో పాపన్న టెంపరేచరు మరింత పెరిగింది విచారాన్ని దిగమ్రింగలేక గుండె లవిసేటట్లు ఏడ్చాడు పాపన్న. క్రితం రోజునుండి వైద్యం లేక జ్వరంతో మూల్గుతున్న పాపన్న ఆ విచారానికి తట్టుకోలేక సొమ్మసిల్లిపోయాడు.

పాపన్న తిరిగి పూర్తిగా ఆరోగ్యవంతుడవ్వడానికి ఇరవై రోజులు పట్టింది. ఆ ఇరవై రోజులూ పాపన్న మందులు తీసుకుంటూనే వున్నాడు దానికైన ఖర్చంతా మంగపతిరావు భరించడంతో పాపన్నకు యజమానిమీద వున్న విశ్వాసం మరింత పెరిగింది.

* * *

గుండేరు వంతెన రాగానే కండక్టరు ఈల వేయడంతో సడన్ బ్రేకుతో "ఖస్సు" మని శబ్దం చేస్తూ ఆగింది బస్సు. సూట్‌కేసుతో బస్సులోంచి రాంబాబు దిగాడు. కండక్టరు శాసనాలను శిరసావహిస్తున్న డ్రైవరు "రైట్" అన్న కండక్టరు మాటకు బస్‌ను ముందుకు నడిపాడు బస్సు వెళ్ళిపోయింది.

రోడ్డుమీద నిలబడిన రాంబాబు ప్రకృతిని నాలుగుపైపులా వింతగా చూశాడు. చుట్టూ పచ్చగా వున్న చేలు. ప్రక్కగా అందమైన అమ్మాయి నడకలా సాగుతున్న కాలువనీరు. దూరంనుండి వినిపిస్తున్న రైతుల రాగాలు. చెట్ల కొమ్మలమీద దోబూచులాడుకుంటున్న కోయిల కేరింతలు. చల్లగా వీస్తున్న గాలి. రాంబాబుకి ఆహ్లాదాన్ని కలిగించాయి.

వంతెన దిగువుగా ఒక కాలిబాట వుంది. ఆ కాలిబాట వెంబడి నాలుగు మైళ్ళుపోతే

## జంట నృత్యం



— కె. లోకనాధన్, తిరుపతి.

ఒక గ్రామం తగులుతుంది. ఆ గ్రామమే రాంబాబుది. దేశంలో ఎన్నో గ్రామాలున్నాయి గ్రామాభివృద్ధికి ప్రభుత్వం పట్టుదలతో ఎన్నో పథకాలను చేపట్టింది ఎన్ని పథకాలను చేపటినా. స్వార్థపరుల చేతుల్లో చిక్కుకున్న గ్రామాలు అభివృద్ధి చెందలేదనటానికి రాంబాబు ఊరు ఒక నిదర్శనం కాని దేశంలోని రాజకీయ పార్టీలన్నీ ఆ పూళ్ళో వున్నాయి.

రాంబాబు ఆ వూళ్ళో వున్న స్కూల్లోనే అయిదు వరకూ చదివి తండ్రి పోత్సాహం మీద పట్టణంలో వున్న మేనత్త యింటిలో వుండి హైస్కూలు చదువు పూరిచేసి ఆ పట్టణంలోనే కాలేజీ చదువు ప్రారంభించి యిపుడు బి ఎ ఫైనలియర్లో వున్నాడు.

రాంబాబు కాలిబాట వెంట నడుస్తున్నాడు. దారికి ఆ ప్రక్కా యీ ప్రక్కా వున్న చిన్న చిన్న చెట్లు పొదలూ రాంబాబు చేతిలో వున్న సూట్ కేస్కు రాసుకుని శబ్దం చేస్తున్నాయి ఒక్కసారిగా నడుస్తున్న వాడల్లా ముందుకు తూలాడు రాంబాబు బూటుకు ఏమిటి దెబ్బతగిలింది "ఛి ! ఛీ ! యీ దార్లు పోయిరోడ్లు ఎప్పుడు వస్తాయో ," విసుక్కున్నాడు రాంబాబు ప్రభుత్వంమీద భరించరాని కోపంతో చిరాకు పడ్డాడు.

ఉత్తరం ముక్కయినా రాయకుండ ఇంటికొచ్చిన కొడుకుని చూసి ఒకవెపు సంతోష పడినా మరొవైపు పట్టణంలో ఏం జరిగిందో నన్న అనుమానం మంగపతిరావును ఆవరించింది

"అదేమిటి బాబూ ! ఉత్తరమైనా రాయకుండ వచ్చావేమిటి ? యీ సూట్ కేసు నువ్వే మోశావా ! వస్తున్నానని ఒక్క కార్డు రాసివుంటే రోడ్డుకి మనిషిని పంపుదును గదా ! ఏం బాబు పట్టణంలో ఏమైనా గొడవలు జరిగాయా :"

అప్పుడప్పుడూ అల్లర్లు సమ్మెలు జరుగుతున్న కారణంగా ఆసక్తితో అడిగాడు మంగపతిరావు.

"అది పట్టణం నాన్నా ! గ్రామంకాదుగా గొడవలు వుండటానికీ జరగడానికీ ?"

రాంబాబు చిన్నగా నవ్వాడు గ్రామంలో వుండేవి నాలుగిళ్ళే అయినా పదిరకాల గొడవలు సమస్యలు పటణాన్ని మించి వుంటాయని రాంబాబుకు తెలుసు

"ఎలక్షన్లు వస్తున్నాయి గద నాన్నా ! అందుకే వచ్చాను యీసారి నువ్వు తప్పక గెలవాలి '

కొడుకు మాటలు విని వుప్పొంగి పోయాడు మంగపతిరావు

"ఏమిటి పాపన్నా ! అలా చిక్కి పోయావు '

గడ్డిమోపు దొడ్లో వేసి వస్తున్న పాపన్ను నుద్దేశించి ప్రశ్నించాడు రాంబాబు

అనుకోకుండ వాడి పెళ్ళాం చచ్చి పోయింది."

రక్కున సమాధాన మిచ్చాడు మంగపతిరావు.

ఆ మాట విన్న రాంబాబు బిగుసుకు పోయాడు

ఆం ! పాపన్న పెళ్ళాం చనిపోయిందా ! అంత అందమైన రత్తాలకు అప్పుడేనూరేళ్ళు నిండిపోయాయా ! జీవితంలో ఏమంత సుఖాన్ని కూడగట్టుకున్నదని అప్పుడే ఆమెను మృత్యుదేవత వరించింది. అందమైన ఆడవారు ఎక్కువ కాలం జీవించకూడదనేది బహుశా భగవంతుడు నిర్ణయించిన శాసనమేమో ....

"కులాసేనా బాబుగోరూ ."

తన ఆలోచనలకు అంతరాయం కల్గించిన పాపన్న మాటకు వులిక్కిపడి "ఆ ! ఆ ! కులాసాయే !" అన్నట్టుగా తలూపాడు రాంబాబు

"పాపన్నా ! నిన్నొంటరి వాడ్ని చేసి రత్తాలు వెళ్ళిపోయిందా !"

"బాబుగోరూ ! నాను దాన్ని మరచి

పోనాను మళ్ళీ మీరు గేపకం సెయ్యొద్దు !"

పైకి పాపన్న అలా అన్నా లోలోపల బాగా కుమిలిపోతున్నాడని రాంబాబు గ్రహించాడు

ఆ మరుసటిరోజు రత్తాలు మామూలుగా చావలేదని నూతిలో పడి ఆత్మహత్య చేసుకుందనీ రాంబాబుకు తెలిసింది

* * *

ఎలక్షన్లు దగ్గరపడ్డాయి. పంచాయతీబోర్డు ప్రెసిడెంటుగా యిటు మంగపతిరావు అటు నాగభూషణం ఇద్దరూ పోటీగా నిలబడ్డారు. మొదటనుండీ వీరిరువురూ పోటీ పడటం, ఎవరో ఒకరు ఓడిపోవడం, ఓడినవారు గెలిచిన వార్ని నానా విధాలుగా కించపరచడం తర్వాత తగువులు రావడం, కొట్టుకోవడం జరుగుతూనే వుంది కాని గతసారి కూడా ప్రెసిడెంటుగా నాగభూషణం గెలిచాడు దానితో మంగపతిరావు కొన్ని అనుమానాలకు గురయ్యాడు అందుకేమైనా సరే యీ సారి తను తప్పక గెలిచి, నాగభూషణాన్ని అవమాన పరచాలని మంగపతిరావు పట్టుబట్టాడు ప్రచారం ముమ్మరంగా సాగుతుంది.

మంగపతిరావు తరఫున తన గూడెం కంతకూ తనే లీడరె. ఓట్లన్నీ మంగపతిరావు కెయ్యవలసిందని ప్రతి వారితో, ప్రతి రోజూ చెబుతూ, కావలసిన వాళ్ళకు సారా దుకాణంలో ఖాతా కూడా కుదిర్చాడు గోపయ్య.

ఆ రోజు బాగా చీకటి పడిపోయింది

గోపయ్య తూలుతూ నడుస్తూ సారా బుడ్డితో పాపన్న గుడెసె దగ్గరకొచ్చాడు.

"ఒరే, పాపిగా' గట్టిగా పిల్చాడు

తలుపులాంటి తడికెను ముందుకుతోశాడు

"ఏంట్రా "

నిద్ర కుపక్రమిస్తున్న పాపన్న నులక మంచం మీదనుండి పైకి లేచాడు పైన కప్పుకోవాలనుకున్న రగ్గులాంటి నాదా ఒంచెను ప్రక్కకు నెట్టుతూ

"కూచోరా మాట సెబుతా "

గుమ్మంలో నేల మీద చతికిల బడ్డారిద్దరూ

"ఓ చుక్కేసుకో ముందు "

మూత తీసి సారా బుడ్డి పాపన్న ముందు పెట్టాడు గోపయ్య.

"ఎందిది, నానెప్పుడన్నా తాగేనా?'

"నువ్వు రోజు రోజుకి సిక్కిపోతుండావు. రత్తిని మరిసిపోలేక పోతుండావు. దాన్ని మరిసిపోయి, నువ్వు సుఖంగా వుండాలంటె యిది తాగాల్సిందెరా "

"ఎంటెబా. నాను దాన్నెప్పుడో మర్సిపోనాను "

"మర్సిపోనోడివైతే మళ్లా పెళ్ళెందుకు సేసుక్కోలేదురా "

ఎలక్షను ప్రచారం గురించిన ఏదో చెప్పాలని వచ్చిన గోపయ్య అసలు విషయం మరచిపోయి మరోదారి పట్టాడు

"నీ సెల్లెల్ని చేసుకుంటా '

ఆ మాటలకు గోపయ్య వులిక్కిపడ్డాడు వులిక్కిపడిన గోపయ్య సారాబుడ్డి పైకెత్తి సగం పీల్చాడు.

ఏంట్రా నువ్వనేది ?'

"అవునెహె నీ సెల్లులికి మొగుడు సచ్చాడు నాకు పెళ్ళాం సచ్చింది ఇపుడు మేమిద్దరం పెళ్ళాడితే తప్పేంట్రా '

"సత్తే నా సెల్లెల్నియ్యను "

గోపయ్య మరోసారి బుడ్డి పైకెత్తి సారా ఖాళీ చేశాడు ఖాళీ అయిన సారా బుడ్డి కళ్ళెదురా కనబడకూడదన్నట్టు ప్రక్కకు విసురుగా విసిరాడు

"ఏం ఎందుకియ్యవు నాలో తప్పేంటి "

నిగ్గదీసి ఎదురు ప్రశ్న వేశాడు పాపన్న.

దానికి గోపయ్య ఒక వెకిలినవ్వు నవ్వాడు

"సేసుకున్న కాడ్నించి మల్లిని పెళ్ళాన్ని అయ్యగోరింట్లో పని చేయమంటావు అయ్యగోరు కన్ను దానిమీద పడితే యింకేమన్నా వుందా !'

"ఎంట్రా నువ్వనేది ?"

"అవునహె ఆ రోజు రత్తిని అయ్యగోరు బలవంతం చేసి పక్కలోకి లాక్కున్నాడు నీతి గల ఆడది కనక మల్లీ నీకు మొగం సూపించలేక నూతిలో పడి పచ్చింది "

"ఎట్రా నువ్వుచెప్పేదంతా నిజమేనా ,"

"అవునెహె ఆ రగస్యం నా కొక్కడికే తెల్సు మరోరికీ సెప్పొద్దని అయ్యగారు నా మొగాన నాలుగొందలు కూడా పాడేసిండు "

ఆ మాట విన్న పాపన్నకు రక్తం గడ్డ కట్టుకుపోయింది.

రోషంతో నిలబడి బలం కొద్దీ గోపయ్య గుండెలమీద తన్ని గుడిసెలో దూరాడు

ఆ తన్నుకి వెల్లకిలా పడిన గోపయ్యకు కొంచెం మత్తు వదలడానికి టైం పట్టింది

తను మాట్లాడినదేమిటో తెలుసుకున్న గోపయ్య కొంప మునిగిందనుకుని లేచి పరుగు పరుగున మంగపతిరావు యింటికి చేరాడు

"అయ్యగోరూ !

తలుపు బాదాడు గోపయ్య

"ఎవుట్రా ! ఏమైంది ?"

ఆతృతతో తలుపుతీసి బయటకు వచ్చాడు మంగపతిరావు.

"కొంపమునిగి పోనాది బాబుగోరూ !"

"ఏమైందిరా "

"మన రగస్యం తెల్సి పోనాది."

"ఏ రహస్యం ? ఎవరికి ?"

గదిలో నిద్ర కుపక్రమిస్తున్న రాంబాబు బయట జరిగే సంభాషణ పట్ల ఆసక్తి చూపాడు

'రత్తాలు సావుకి మీరే మూలమని పాపిగాడికి తెల్సిపోనాది."

"ఎవరు చెప్పారు ?"

"నానే తెలీకుండా వాగేసాను బాబు "

లాగి లెంపకాయ కొట్టాలని చెయ్యి పైకెత్తాడు మంగ పతిరావు కాని, చటుక్కున ఏదో ఆలోచనరాగాఎత్తినచెయ్యి క్రిందకు దించి గోపయ్య చెయ్యి పట్టుకుని గబగబా తన గదిలోకి లాక్కుపోయాడు

కిటికీలో నుంచి యిదంతా గమనిస్తున్న రాంబాబు వారిరువుర్నీ అనుసరించాడు.

"పాపిగాడు రేపీపాటికీ యీ భూమ్మీదుండటానికి వీల్లేదు, నువ్వాపని చూడు మిగిలిన పని నేను చూసుకుంటాను "

చుట్టూ ఒకసారి చూచి, ఎవ్వరూ తమ సంభాషణ వినడంలేదని నిర్ధారణ కొచ్చిన మంగపతిరావు గోపయ్యతో అన్నాడు.

"అదెంతపని బాబూ"

"అంతేగాదు. పాపిగాడ్ని నాగభూషణం పార్టీవాళ్ళు చంపినట్టుగా వుండాలి." వంద రూపాయల నోటు అందించాడు మంగపతిరావు

"అవంతా నే సూసుకుంటాగా"

అంటూ మంగపతిరావు యిచ్చిన వంద రూపాయల నోటు బనీను జేబులో కుక్కుకుంటూ బయటకు నడిచాడు గోపయ్య.

ఆ ! ఎంత దారుణం ?

రత్తాలు ఆత్మహత్యకు నాన్న కారకుడయ్యాడన్న మాట ! నాన్న చివరకీస్థితికి దిగజారాడా ! పైగా మరో దారుణమైన హింసాకాండకు మూలకారకుడు కాబోతున్నాడా !

ఒక మనిషి మరో మనిషిని నిలువునా ఖూనీ చెయ్యడానికి తలపడటమా ,

తన తోటి మనిషి ప్రాణాన్ని నిలువునా తియ్యడానికి మానవునిలోని దయా ప్రేమానురాగాలు ఏమయ్యాయ్ ?

మనుష్యుల్లోని మానవత్వ మెక్కడనిద్దుర

పోతుంది ?

లేదు యీ దారుణం జరగడానికి వీల్లేదు యీ అన్యాయాన్ని అరికట్టాలి

ఆ రాత్రి రకరకాల ఆలోచనల్తో సరిగ్గా నిద్రపోలేదు రాంబాబు.

ఆ మరుసటిరోజు పాపన్న పనిలోకి రాలేదు అసలా రోజంతా మంగపతిరావు గారింటికే రాలేదు. వస్తే విషయమంతా చెప్పి పాపన్నను ఆపదనుండి కాపాడాలని రాంబాబు ఎదురు చూశాడు పాపన్న కోసం వూరంతా గాలించినా ఎక్కడా కనుపించలేదు.

కాని,

మంగపతిరావు మీద పగ తీర్చుకోవాలనుకున్న పాపన్న అన్ని పార్టీలవాళ్ళూ కొత్త కాంగ్రెసులో చేరిపోతున్నట్టు నాగభూషణం పార్టీలో కలిసిపోయాడు.

అదేరోజు సాయంత్రం గుండేరు వంతెన వద్ద రెండు పార్టీలవాళ్ళ మధ్య ఎలక్షను ప్రచారంలో పెద్ద ఘర్షణ జరిగింది రెండు పార్టీల వాళ్ళూ కర్రలూ, యీటెలూ తీసుకుని కలియబడ్డారు చేతిలో ఏ ఆయుధాలు లేని పాపన్న గోపయ్యా కలియబడి ఒకళ్ళ మీద ఒకళ్ళు దొర్లుతున్నాడు.

న్యాయం, అన్యాయం ఒకదానిమీద ఒకటి పొర్లుతున్నాయి.

పాపన్న క్రిందపడి పోయాడు

పైనవున్న గోపయ్యా పాపన్న కడుపు కేసి 'దభీ దభీ' మని బాదుతున్నాడి.

అవినీతి విజృంభించి నీతిని చావకొడుతుంది.

తండ్రి చేసిన అన్యాయాలకు తలపెటిన అఘాయిత్యాలకు ఏరీతిగా ఎదొర్కొని నచ్చచెప్పాలో ఎన్ని విధాల ఆలోచించినా రాంబాబుకు అంతుచిక్కలేదు.

అంతలో గుండేరు వంతెనవద్ద రెండు పార్టీలమధ్య ఘర్షణ జరుగుతుందని, అందులోనూ ఆ ఘర్షణలో గోపయ్యా పాపన్న, తండ్రి ముగ్గురూ వున్నారని తెలిసి అక్కడ జరుగుబోతున్న ఒక అన్యాయాన్నైనా ఎదుర్కోవడం మానవత్వమున్న మనిషిగా తన కనీస ధర్మమని యెంచి వంతెనవైపు పరుగుదీశాడు రాంబాబు

రాంబాబు ఆయాసంతో వంతెన దగ్గరకు చేరేటప్పటికి గోపయ్యా ప్రక్కవాని చేతిలోని యీటెను లాక్కొని క్రింద పడి వున్న పాపన్న మీద కెత్తాడు.

అతడేం చెయ్యబోతున్నాడో వూహించిన రాంబాబు ఆలోచించకుండా అపాలని అడ్డం వెళ్ళాడు

యీటె పాపన్న గుండెల్లో దిగలేదు.

రాంబాబు డొక్కలో దూరింది

"అబ్బా" గట్టిగా అరచాడు రాంబాబు

ఆ కేకకు అందరూ వులిక్కిపడ్డారు దెబ్బలాట ఆగిపోయింది అందరి చేతుల్లోని కర్రలు, యీటెలు నేల కొరిగాయి. గుంపుగా రాంబాబు చుట్టూ మూగారు.

"బాబూ!" నేలమీద పడి వున్న రాంబాబుని చూసి వెర్రి కేక వేశాడు మంగపతిరావు

"నాన్నా! నువ్వు ... నడి ... చేది ... తప్పుడు త్రోవ... అని నీకెలా చెప్పాలో .. నాకింత .. వరకూ తెలియలేదు, కాని ... యిప్పుడు .. తెలిసింది .. నా .. మరణమే .. నిన్నిక ఆ . త్రోవలో . నడవ నివ్వదు.... నిజం....ఇది ని........".

ఆ తర్వాత రాంబాబు మరి మాట్లాడలేదు.